

కథా కౌముది

# ఎగరడానికి రెండు రెక్కలు వి.శ్రీనివాస మూర్తి

"ఇంకా నీ సుపుత్రుడు ఇంటికి రాలేదా ??" రామనాథం ఇంటికి రాగానే రోజు అడిగే ప్రశ్న.

" రాగానే వాడి గురించేనా , అదీ వ్యంగ్యంగా. భోజనానికి రండి."

" నా కర్మ. ఈ వయసులో బాధ్యత లేకుండా తిరిగే పాతికేళ్లు దాటిన కొడుకు మనసుకు క్షోభ కలిగిస్తుంటే , భోజనం ఒకటే తక్కువ. చదువు అంతంత మాత్రమే. ఉద్యోగం చేయడట. పెళ్ళాం పిల్లలు అక్కర లేదట. ఏదో సమాజాన్ని ఉద్ధరిస్తాడట . మనము పెద్ద వాళ్లం అవుతున్నాము. బాధ్యత లేకుండా తిరుగుతున్నాడు."

కాళ్లు చేతులు కడుక్కొని భోజనానికి కూర్చొన్నారు. వడ్డిస్తూ నిలబడింది. కొడుకు గురించి భర్త కోపం , మానసిక వ్యథ తనకు తెలుసు.

కళ్యాణ్ చదువు కొనే రోజుల్లో కూడా అనాథ ఆశ్రమంలో సేవ చేసేవాడు. సంసార బాధ్యతలలో మునిగి తేలడం చేయదల్చు కోలేదు. తన జీవితాన్ని పరుల , ముఖ్యంగా అభాగ్యుల సేవ లో గడపాలని గుర్తించాడు.

సీత కి ముందు ముందు కొంత బాధ కలిగినా, మెల్లగా తన కొడుకు ఆలోచన తీరు సబబు అనిపించింది.

ఇద్దరు ఎప్పుడు ఎదురు పడినా, ఘర్షణ పడడం తనకి బాధ గానే వుంది కానీ, నిస్సహాయురాలు గా వుండడం అలవాటు చేసుకొంది .

భర్త భోజనం కాగానే ఏదో మాగజీన్ చదువుతూ సోఫా లో కూర్చొన్నాడు. కాసేపటికి కొడుకు కళ్యాణ్ వచ్చాడు. స్నానం చేసిన తర్వాత తల్లి కొడుకులు భోజనానికి కూర్చొన్నారు. రామనాథం కి కోపం రగులుతున్నా , పాపం ప్రశాంతంగా అన్నం తిననీ అని ఊరు కొన్నాడు..

భోజనం అయిపోగానే , కళ్యాణ్ వచ్చి ఎదురు సోఫాలో కూర్చొన్నాడు.

రామనాథం ఇంక ఆగ లేక పోయాడు.

కోపంగా " నేను అంటే నీకు బొత్తిగా లెక్క లేదు. నీ కోసమే నా జీవితం ధార పోసాను , నీవు మాత్రం , నీ ఇష్టం వచ్చినట్లు చేస్తున్నావు.. నీ మంచికే కదా నేను చెప్పేది."

కళ్యాణ్ ఆవేశం గానే " నేను పాతికేళ్ళ వాడిని. నాకు ఏది ఆనందం ఇస్తుంది, ఎలా బతకాలో తెలుసు. మీ అభిప్రాయాలు నా పై రుద్దకండి. నేను ఏమి తప్పు పని చేయడం లేదు. మీరు ఊరకే విసిగిస్తున్నారు. అంతగా మీకు మీతో వుండడం కష్టం అయితే , ఆశ్రమం లోనే ఉంటాను "

"మరి భవిష్యత్తు సంగతి ఏమిటి?"

రెచ్చి పోయి " ఇక మీరు నా భవిష్యత్తు గురించి అడిగారు. కేవలం "ఈ క్షణం" మాత్రమే వుంది ఏదైనా చేయడానికి. నాకు ఆనందం ఇచ్చేది చేయనివ్వండి. నా చేతిలో వున్న క్షణాన్ని వృధా చేసుకొని అందరిలా భవిష్యత్తు అని చెప్పి మనసులో జీవించ లేను.. దయచేసి ఇంక ఎప్పుడు ఈ సంగతి ఎత్త వద్దు. "

తండ్రి షాక్ తిన్నాడు . ఇంకా కోపం పెరిగింది. తన కర్మ కొద్దీ ఇలా తయారు అయ్యాడు అనుకొన్నాడు . ఆ భావన వ్యక్తం అయ్యేలా కొడుకు వైపు చూశాడు.

తండ్రి ఆ చూపులు తనకు అలవాటే.

తన లాగా భయపడుతూ జీవించాలని ఆయన కోరుకున్నా, తాను ఒక అంగుళం కూడా తన మార్గం విడవ కూడదు అని ధృఢంగా నిర్ణయించుకున్నాడు.

రామనాథం ఉడికి పోతున్నాడు . కళ్యాణ్ విసిగి పోతున్నాడు.

" నేను వాడి మంచి కోరే కదా ఇంత చెపుతున్నాను, డబ్బు కూడబెడితే వాడికే కదా ఉపయోగపడుతుంది. నాకు ఒరిగేది ఏమి లేదు. ఎందుకు అర్థం చేసుకొడు. నేను వాడిని ఎంతగా ప్రేమిస్తునాను ??" రామనాథం మనసులో .

"నా మీద తన భావాలు రుద్దాలని చూస్తాడు. నాన్నని నేను ఎంత గౌరవిస్తాను. ఎందుకు అర్థం చేసుకోడు? " కళ్యాణ్ మనసులో.

ఇంతలో రామనాథం బెడ్ రూమ్ లోకి వెళ్తూ , ఎప్పుడు లేనిది కళ్యాణ్ కళ్లలో కళ్ళు పెట్టి చూశాడు. కళ్యాణ్ కూడా నాన్న ని చూశాడు.

ఏదో స్పురించింది కళ్యాణ మనసులో సడన్ గా. గట్టిగా అరిచాడు . నాన్నకు వినబడేలా. అరవాలని అరవ లేదు. ఏదో శక్తి అరిచేలా చేసింది. తనకే తెలియడంలా ఏమి జరుగుతోందో. కానీ స్వరంలో కోపం లేదు, విసుగు లేదు. చాలా సౌమ్యంగా

" నాన్న ఇప్పుడే తెలిసింది . నీవు ఇదంతా నా మీద ప్రేమతో అంటున్నావు. నా మీద ద్వేషంతో కానీ , నన్ను కంట్రోల్ చేయాలి అని కాదు. నాకు విసిగించాలి అని కాదు. నన్ను నీవు గాఢంగా ప్రేమిస్తున్నావు. ఇప్పటికీ దాకా ప్రేమించావు. ఇక ముందు కూడా ప్రేమిస్తావు"

తండ్రి కొడుకులు ఒకరినొకరు చూసుకొంటూవున్నారు . ఇప్పటి వరకు జీవితం లో నిజంగా ఒకరినొకరు చూసుకోలేదు.

అభిప్రాయాలు, నమ్మకాలు, అనుభవాల ముసుగులో చూసుకున్నారు. అందుకే ఇప్పుడు ఎంత సేపు చూసుకొన్నారో తెలియడం లేదు. మనసు సంకెళ్ళు లేని ఆత్మలతో చూసుకున్నారు.

ఎవరు మొదలు పెట్టారో తెలియదు. ఏడవడం మొదలు పెట్టారు. ఇద్దరు చిన్న పిల్లలు అయిపోయారు. ఆ కోపాలు , విసుగులు , అన్ని మాయం. కేవలం ఏడుపు. ఎన్నో సంవత్సరాల బరువు తీసినట్లు . తరవాత తెలియకుండానే ఒకరి కౌగిలి లో ఒకరు చేరి పోయారు. ఎన్ని యుగాలు అయిందో ఇలా కౌగలించుకొని.

“ ఒరే నాన్న , నేను ,మీ అమ్మ, నిన్ను అమితంగా ప్రేమిస్తాము రా. మా ఇద్దరికీ నీవు తప్ప లోకం లేదు.. నీకు అంతా మంచి జరగాలనే రా మా తపన. ప్రపంచంలో అందరి కొడుకుల కంటే ఆనందంగా వుండాలనే రా మా కోరిక. మేము . ఉయ్ లవ్ యు నాన్న “ నాన్న ఆత్మ ఘోష . ఒకరి బాహువులో ఇంకొకరు కన్నీరు కారుస్తూ చాలా చాలా సేపు గడిపారు.

సీతకి ఎన్నో రోజుల తర్వాత , ఇది చూసి హృదయం పొంగి పోయింది. తాను కూడా వారి ఆలింగనంలో చేరింది.

ఇంత వరకు ఎప్పుడు ఇలా జరగ లేదు. ఇప్పుడు ఇద్దరూ హృదయాలు విప్పారు. ప్రేమకి లొంగి పోయారు. ప్రేమ చెప్పుకున్నారు. ప్రేమ ఒప్పుకున్నారు. ప్రేమ పంచుకున్నారు. ప్రేమ అనుభవించారు . మనసులో వున్న సంకెళ్ళు తెగి పొయ్యా యి. సత్యమైన ప్రేమ అవగతం అయింది.

ఈ సారి చూడడమే వేరు. ఇదేనేమో నిజంగా వున్నది వున్నట్లు చూడడం. మనసు ప్రమేయం లేకుండా .

ఇద్దరి అభిప్రాయాలు మార లేదు. విలువలు, నీతులు మారలేదు. కేవలం వున్నది వున్నట్లు చూడడం , మనసు గోల పక్కన పెడితే మిగిలింది శుద్ధ ప్రేమ. పరమానందం .

మళ్ళా ఆ ఇంట్లో ఆ విషయం పై చర్చ రాలేదు. కళ్యాణ్ వరకు తనకు నచ్చిన సేవలో మునిగి పోయాడు . రామనాథం , కొడుకు పరిస్థితి ని అంగీకరించాడు .

మనల్ని నడిపించే ఆ అదృశ్య శక్తి మన మేలు కోరి అప్పుడప్పుడు మన అనుభవాలను ఇంకొక దిశలో తిప్పి చూపిస్తుంది. విరుద్ధమైన అనుభవాల ద్వారా జీవిత పాఠాలు నేర్పుతుంది. అందుకే ఒకటి కాదు “ రెండు రెక్కలు ఎగరడానికి”

COMMENTS